సాక్షి
అనంతపురం
బుధవారం । 30 । అక్టోబర్ । 2024



కూటమి సాయం నిల్

కూటమి సర్కారు నుంచి ఎలాంటి సాయం అందకపోవడంతో పంటల సాగుపై రైతులు ఆసక్తి కనబరచడం లేదు. 8లో



టమాట కిలో రూ.28

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.28 పలికింది. కనిష్టం రూ.13, సరాసరి రూ.20 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

తమ్ముళ్ల అక్రమాలు బట్టబయలు



అధికారులు సీజ్ చేసిన టిప్పర్

రాయదుర్గం: అధికారుల తనిఖీల్లో 'తమ్ముళ్ల' గ్రావెల్ అక్రమాలు బట్టబయలయ్యాయి. ఈ నెల 27న 'తవ్వుకున్నోళ్లకు.. తవ్వుకున్నంత' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. విజిలెన్స్‌ను రంగంలోకి దించారు. ఈ క్రమంలో వారు రాయదుర్గం నియోజకవర్గంలోని డీ హీరేహాళ్, బొమ్మనహాళ్ మండలాల్లో రెండు రోజులు తనిఖీలు చేపట్టారు. కర్నూలు మైన్స్‌అండ్ జియాలజీ ఏడీ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆర్‌ఐలు సాంబాశివారెడ్డి, సుప్రజ, వివిధ శాఖల అధికారులతో కలిసి విస్తృత తనిఖీలు నిర్వహించారు. సోమవారం బొమ్మనహాళ్ మండలం నేమకల్లు వద్ద రోడ్డు మెటల్ క్వారీల్లో రాయల్టీలు, క్వారీ అనుమతులపై ఆరా తీశారు. టీడీపీ నాయకుడి మూడు టిప్పర్లను పట్టుకున్నారు. అనుమతి పత్రాలు చూపడంతో రెండింటిని వదిలేసి.. మరో టిప్పర్‌ను సీజ్ చేసి బొమ్మనహాళ్ పోలీసులకు అప్పగించారు.

- మంగళవారం డీ హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురం సమీపాన జాతీయ రహదారి పక్కన, సోమలాపురం, లింగమనహళ్లి వద్ద విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సోమలాపురం వద్ద అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లు, జేసీబీని సీజ్ చేసి డీ హీరేహాళ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

యువజన సంక్షేమ అధికారిగా రవిశంకర్‌రెడ్డి

అనంతపురం అర్బన్: జిల్లా యువజన సంక్షేమ అధికారిగా ఎస్.రవిశంకర్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలో 32 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ మంగళవారం పోస్టింగ్ ఇచ్చారు. రవిశంకర్‌రెడ్డిని జిల్లా యువజన సంక్షేమ అధికారిగా నియమించారు.

క్రైమ్ బ్రాంచ్ పోలీసుల పేరుతో కుచ్చుటోపీ

- ఏకంగా రూ. 72 లక్షలు స్వాహా

గుత్తి: క్రైమ్ బ్రాంచ్ పోలీసుల పేరుతో ఓ రైల్వే ఉద్యోగికి సైబర్ నేరగాళ్లు కుచ్చుటోపీ పెట్టారు. బ్యాంకు ఖాతాలో నుంచి ఏకంగా రూ. 72 లక్షలు స్వాహా చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలిలా.. గుత్తి ఆర్‌ఎస్‌లోని చంద్ర ప్రియ నగర్‌కు చెందిన రైల్వే ఉద్యోగి షేక్ మహ్మద్ వలీకి నాలుగు రోజుల క్రితం ఫోన్ కాల్ వచ్చింది. 'మేం ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులం, ఇటీవల ముంబైలో జరిగిన బాంబు పేలుడులో నువ్వెందుకు ఉన్నావు' అంటూ అవతలి వారు షేక్ మహ్మద్ వలీతో అన్నారు. దీంతో భయపడిన వలి.. తాను ముంబైకే వెళ్లలేదని చెప్పగా సైబర్ నేరగాళ్లు అతనిని దబాయించారు. 'పేలుడు జరిగిన ప్రాంతంలో నీ ఏటీఎం ఉంది. మర్యాదగా ఒప్పుకో.. లేకపోతే అరెస్టు చేస్తాం' అంటూ బెదిరించారు. కేసు నుంచి బయట పడాలంటే బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బంతా పంపాలన్నారు. దీంతో వలీ మొదట రూ. 12 లక్షలు, తర్వాత రూ. 60 లక్షలు సైబర్ నేరగాళ్లు చెప్పిన బ్యాంకు అకౌంట్ నంబర్లకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. రూ. 22 లక్షలు ఎఫ్‌డీ (ఫిక్స్‌డ్ డిపాజిట్) ఉండగా, ఎఫ్‌డీలు రద్దు చేసి ఆ డబ్బు కూడా సమర్పించుకున్నాడు. అప్పటి నుంచి ముభావంగా ఉన్న వలీని గుర్తించిన సహచరులు ఏమైందని ప్రశ్నించగా జరిగిన విషయం అంతా చెప్పారు. ఈ క్రమంలో వారి సూచన మేరకు మంగళవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైబర్ నేరగాళ్ల ఫోన్ నంబర్లను పోలీసులు పరిశీలించగా ఒకటి జమ్మూకశ్మీర్ నుంచి, మరొకటి కోల్‌కతా నుంచి వచ్చినట్లు తేలింది.



వనితలదే పైచేయి!

- ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసిన కలెక్టర్
- జిల్లాలో మొత్తం ఓటర్లు 20,20,441
- పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నట్లు వెల్లడి



ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో డీఆర్‌ఓ మలోల

అనంతపురం అర్బన్: జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నట్లు వెల్లడైంది. ముసాయిదా ఓటరు జాబితాను జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ వి.వినోద్‌కుమార్ మంగళవారం తన చాంబర్‌లో డీఆర్‌ఓ ఎ.మలోలతో కలిసి విడుదల చేశారు. లెక్కల ప్రకారం జిల్లాలో 20,20,441 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 9,98,784 మంది, మహిళలు 10,21,412 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 245 మంది ఉన్నట్లు తేలింది. ఎన్నికల కమిషన్ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించిన వెంటనే కొత్తగా ఓటరు నమోదు, ఓటు తొలగింపు, ఓటు వివరాల మార్పు ప్రక్రియ ప్రారంభమైంది. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తైన తరువాత 2025, జనవరి 6వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు ఇలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం
రాయదుర్గం	1,30,558	1,33,409	42	2,64,009
ఉరవకొండ	1,10,702	1,13,905	28	2,24,635
గుంతకల్లు	1,33,021	1,37804	74	2,70,899
తాడిపత్రి	1,23,513	1,25,509	25	2,49,047
శింగనమల	1,23,266	1,24,682	29	2,47,977
అనంతపురం	1,37,943	1,43,786	28	2,81,757
కళ్యాణదుర్గం	1,14,603	1,16,539	7	2,31,249
రాప్తాడు	1,25,178	1,25,678	12	2,50,868
మొత్తం	9,98,784	10,21,412	245	20,20,441

పెరిగిన ఓటర్లు

ఈ ఏడాది జనవరి 6న విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 19,94,544 మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ కావడంతో అందిన దరఖాస్తులు పరిష్కరిస్తూ ఓటు నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలో 25,897 మంది ఓటర్లు పెరిగారు. ప్రస్తుతం విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం 20,20,441 మంది ఉన్నారు.

అనంతపురం అర్బన్‌లో అత్యధికం..

ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల పరిధిలోనూ పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 25,628 మంది అధికంగా ఉన్నారు. ఈ విషయంలో జిల్లాలోనే అత్యధికంగా అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 5,843 మంది ఉన్నారు. ఇక గుంతకల్లులో 4,783 మంది, ఉరవకొండ- 3,203 మంది, రాయదుర్గం-2,851 మంది, కళ్యాణదుర్గం-2,036 మంది, తాడిపత్రి-1,996 మంది, శింగనమల-1,416 మంది, రాప్తాడు నియోజకవర్గంలో మహిళా ఓటర్లు 500 మంది పురుష ఓటర్ల కంటే అధికంగా ఉన్నారు.

ఓటరు నమోదుకు అవకాశం

ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసిన రోజు నుంచి కొత్తగా ఓటరు నమోదు, తొలగింపు, వివరాల మార్పు ప్రక్రియ ప్రారంభమమైంది. షెడ్యూల్ ప్రకారం మంగళవారం నుంచి నవంబరు 28వ తేదీ వరకు ఓటు నమోదు (ఫారం-6), ఓటు తొలగింపు(ఫారం-7), ఓటు వివరాల మార్పునకు (ఫారం-8) సంబంధించి దరఖాస్తులు, అభ్యంతరాలను స్వీకరిస్తారు. దరఖాస్తుల స్వీకరణకు శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తారు. అందిన దరఖాస్తులు, అభ్యంతరాలను డిసెంబరు 24వ తేదీ నాటికి పరిష్కరిస్తారు. తుది ఓటరు జాబితా ప్రచురణకు ఎన్నికల కమిషన్ అనుమతిని 2025, జనవరి 1వ తేదీన తీసుకుని జాబితా ముద్రణ ప్రక్రియ నిర్వహిస్తారు. 2025, జనవరి 6వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రచురిస్తారు.

వైద్య కళాశాలకు ఏ గ్రేడ్



అనంతపురం మెడికల్: అనంతపురం వైద్య కళాశాలకు ఏ గ్రేడ్ లభించింది. ఈ క్రమంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి న్యూరో సర్జరీ విభాగానికి నాలుగు ఎంసీహెచ్ (సూపర్ స్పెషాలిటీ వైద్య విద్య కోర్సు) సీట్లు కూడా మంజూరయ్యారు. ఈ మేరకు జాతీయ వైద్య మండలి నుంచి ధ్రువీకరణ పత్రం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావుకు అందింది. దీంతో మంగళవారం వైద్య కళాశాలలో సంబరాలు నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటిండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, సంబంధిత విభాగ వైద్యులతో కలిసి ప్రిన్సిపాల్ కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ న్యూరో సర్జరీ విభాగానికి పీజీ సీట్లు మంజూరు కావడం శుభపరిణామమన్నారు. ఇప్పటికే రూ.లక్షలు విలువ చేసే సర్జరీలు ఉచితంగా చేస్తున్నారన్నారు. పీజీ సీట్ల మంజూరుతో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. వైస్ ప్రిన్సిపాళ్లు కేఎల్ సుబ్రమణ్యం, నవీన్, షారోన్ సోనియా, షంషాద్‌బేగం, తెలుగు మధుసూదన్, న్యూరో సర్జరీ విభాగాధిపతి భాస్కర్ మాట్లాడుతూ ఎంసీహెచ్ సీట్ల మంజూరుతో పాటు కళాశాలకు ఏ గ్రేడ్ రావడంలో ప్రిన్సిపాల్ కీలకపాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్‌ఎంసీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.కాగా, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికే వైద్య కళాశాలలో వివిధ విభాగాలకు సంబంధించి 300 వరకు పీజీ, యూజీ సీట్లు మంజూరు కాగా, తాజాగా సూపర్ స్పెషాలిటీకి కూడా ఎంసీహెచ్ సీట్లు కేటాయించడం గమనార్హం.

రైతులను ఉదారంగా ఆదుకోండి



మాట్లాడుతున్న ఎంపీ అంబికా, చిత్రంలో కలెక్టర్ వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న



సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, అధికారులు

- 'దిశ'లో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి డిమాండ్

అనంతపురం సిటీ: పంటలు నష్టపోయిన రైతులను ఉదారంగా ఆదుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అధ్యక్షతన మంగళవారం జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ వరుస తుపాన్లు, ఎడతెరిపి లేని భారీ వర్షాలతో చేతికందివచ్చిన పంటలు నేలపాలయ్యాయన్నారు. రైతుల ఆశలు అడియాసలై అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. కోలుకోలేని పరిస్థితిలో దిక్కులు చూస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదారత చూపాలని కోరారు. లేదంటే రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని 63 మండలాలనూ కరువు ప్రాంతాలుగా ప్రకటించి, రైతులను అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. పాడి పశువులు కూడా మృతి చెంది పాడి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారికి కూడా చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం ఉద్యాన రైతుల సౌకర్యార్థం కిసాన్ రైలు తీసుకువచ్చి, జాతీయ స్థాయిలో ఇక్కడి ఉద్యాన ఉత్పత్తులు అమ్ముకునేలా చర్యలు చేపట్టిందని, కిసాన్ రైలును పునరుద్ధరించేలా చూడాలని కోరారు. అతిసారం, డయేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడుతూ కుంటలు, నాలాలు ఆక్రమించుకుంటున్న వారి సంఖ్య పెరిగిపోతోందన్నారు. వారిని కట్టడి చేయకుంటే ప్రకృతి వైపరీత్యాల బారిన పడక తప్పదన్నారు. అనంతపురంలోని నడిమివంక, మరువవంక ఆక్రమణలు తొలగించాలన్నారు. వ్యవసాయ శాఖ పరిధిలో అమలు చేస్తున్న కార్యక్రమాలపై రైతుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పని చేయాలన్నారు. వాటర్‌షెడ్ల నిర్మాణాల్లో జరిగిన అక్రమాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.

తప్పుడు సమాచారం ఇస్తారా?

పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో జన ఔషధి కేంద్రాల గురించి అడిగితే తప్పుడు సమాచారం ఇస్తారా? అంటూ అనంతపురం ఎంపీ, దిశ కమిటీ చైర్మన్ అంబికా లక్ష్మీనారాయణ జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌పై మండిపడ్డారు. తాను ఫోన్ చేసినప్పుడు 15 కేంద్రాలు ఉన్నాయని సమాచారం ఇచ్చారని, కానీ, ఇప్పుడు ఐదే ఉన్నాయంటున్నారని, మిగిలిన 10 కేంద్రాలు ఏమయ్యాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ జోక్యం చేసుకుంటూ.. ఇలాంటి వారు జిల్లాలో పని చేయడానికి వీల్లేదంటూ సీరియస్ అయ్యారు. ఎంపీ మాట్లాడుతూ సర్వజనాస్పత్రిలో విశ్రాంతి భవన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని ఆదేశించారు. కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలనకు కేంద్ర బృందాల సభ్యులు రానున్నారని, బాధిత రైతుల వివరాలు సేకరించాలని ఆదేశించారు. వాటర్‌షెడ్లలో అక్రమాల కట్టడికి జియో ట్యాగింగ్, సోషల్ ఆడిట్, క్వాలిటీ చెక్ చేయించాలని సూచించారు.సర్వజనాస్పత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్ పనుల పూర్తికి నిధులతో పాటు ట్రామా కేర్ సెంటర్‌ను మంజూరు చేయించేలా చొరవ చూపాలని ఎంపీని కోరారు. మేయర్ వసీం సలీం మాట్లాడుతూ అనంతపురం సర్వజనాస్పత్రిలో ఉన్నతాధికారి పర్యవేక్షణ లేకపోవడంతో వైద్యులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో గుత్తి ఎంపీపీ విశాలాక్ష్మి, బుక్కరాయసముద్రం ఎంపీపీ సునీత, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీపీలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదాతకు తీరని అన్యాయం

- కరువు జాబితాలో ఉమ్మడి జిల్లాలో కేవలం 17 మండలాలే
- చంద్రబాబు సర్కారు తీరుపై రైతుల ఆగ్రహావేశాలు


అనంతపురం అగ్రికల్చర్: సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు అన్నదాతను అడుగడుగునా దారుణంగా వంచనకు గురిచేస్తోంది. 'వ్యవసాయం దండగ' అంటూ గతంలో చంద్రబాబు రైతులను చిన్నచూపు చూశారు. మొన్నటి ఎన్నికల్లో అలవిగాని హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు తన పంథాను మార్చుకోవడం లేదు. ఇప్పటికే గతేడాదికి సంబంధించి ఉచిత పంటల బీమా కింద రావాల్సిన పరిహారాన్ని మరిపించేశారు. ఏడాదికి రైతుకు రూ.20 వేల పెట్టుబడి సాయం అంటూ ఊరించి చివరకు చేయిచ్చారు. నేడు మరోసారి రైతులను దగాకు గురిచేశారు. కరువు మండలాల ప్రకటనతో పక్కా మోసం చేశారు. రైతులకు తీరని అన్యాయం జరిగేలా ఖరీఫ్-2024 కరువు మండలాలను మంగళవారం ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 54 మండలాలను కరువు జాబితాలో ప్రకటించి చేతులు దులిపేసుకున్నారు. అందులో గతేడాదితో పాటు ఈఏడాది కరువు బారిన పడి తీవ్ర కష్టాలు పడుతున్న ఉమ్మడి జిల్లా రైతులను దారుణంగా మోసం చేశారు.

కేవలం 17 మండలాలే..

అధిక వర్షాలు నమోదైన విషయాన్ని సాకుగా చూపించి కరువు జాబితాను ప్రకటించారు. అందులో ఉమ్మడి జిల్లాలో కేవలం 17 మండలాలను మాత్రమే కరువు జాబితాలో చేర్చారు. మిగతా 46 మండలాలకు మొండి చేయి చూపించారు. అనంతపురం జిల్లాలో ఏడు మండలాలు ప్రకటించగా.. అనంతపురం, నార్పల మండలాలను మాత్రమే తీవ్రత (సివియర్) ఉన్నట్లు గుర్తించారు. విడపనకల్లు, యాడికి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, రాప్తాడు మండలాలను మాదిరి కరువు (మోడరేట్) మండలాల జాబితా కింద చేర్చారు. అలాగే, శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో 10 మండలాలను ప్రకటించగా వాటిలో తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపుల మండలాలను కరువు తీవ్రత (సివియర్) కింద ప్రకటించగా, కనగానపల్లి, ధర్మవరం, ఎన్‌పీ కుంట, గాండ్లపెంట, బుక్కపట్నం, రామగిరి, పరిగి మండలాలను మాదిరి కరువు మండలాలు (మోడరేట్)గా గుర్తించారు. జిల్లాలో 24 మండలాలు, శ్రీ సత్యసాయి జిల్లాలో 22 మండలాల రైతులకు తీవ్ర అన్యాయం జరిగేలా చంద్రబాబు సర్కారు వ్యవహరించడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. పెట్టుబడి సాయం (ఇన్‌పుట్‌సబ్సిడీ) కింద కూడా నామమాత్రంగా నిధులు విడుదల చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

రాష్ట్రంలో దోపిడీ పాలన

- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ధ్వజం



ఉరవకొండ: రాష్ట్రంలో చంద్రబాబు దోపిడీ పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వర రెడ్డి మండిపడ్డారు. మంగళవారం అనంతపురంలోని తన స్వగృహంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక, మద్యం ముసుగులో టీడీపీ నాయకులు దోచుకు తింటున్నారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా దోచుకో దాచుకో అన్న చందంగా చంద్రబాబు మార్కు పాలన సాగుతోందని దుయ్యబట్టారు. ప్రజా సంపదను కొల్లగొట్టడంలో ప్రజా ప్రతినిధులు పోటీపడుతున్నారన్నారు. గత ఐదేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ఖాతాల్లోకే డబ్బు జమ కావడంతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉండేవారని, కానీ నేడు బాబు ఒక్క పైసా జమ చేయకుండా నిర్లక్ష్యం చేస్తుండటంతో మండిపడుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక మాటున పెద్ద ఎత్తున దోపిడీ చేస్తోందన్నారు. రీచ్‌లన్నీ ప్రయివేట్ వాళ్లకు అప్పగించామని చంద్రబాబు చెబుతున్నా వారంతా టీడీపీ నేతల కనుసన్నల్లో కొనసాగుతున్నారని తెలిపారు. ఇసుకను అక్రమంగా బెంగళూరు, బళ్లారి వంటి నగరాల్లో భారీ ధరలకు విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారని పేర్కొన్నారు. వైఎస్ జగన్ హయాంలో వర్షాకాలంలో ఇసుక కొరత రాకుండా 80 లక్షల టన్నులు భద్రపరిస్తే, అందులో 40 లక్షల టన్నుల ఇసుకను టీడీపీ నేతలు అమ్ముకున్నారన్నారు. నేడు ఒక్కో టిప్పర్ ఇసుకకు రూ.20 వేల నుంచి రూ. 25 వేలు ఖర్చు చేసుకుంటే తప్ప దొరకడం లేదన్నారు. మరో వైపు మద్యం షాపుల కేటాయింపులో ఇప్పటికీ తగాదాలు పరిష్కారం కావడం లేదన్నారు. టెండర్లు దక్కించుకున్న బయటి వ్యక్తులు షాపులు ప్రారంభించకుండా టీడీపీ నేతలు అడ్డుపడుతున్నారన్నారు. బెల్టుషాపు పెడితే రూ.5 లక్షలు ఫైన్ వేస్తామంటున్న చంద్రబాబుకు.. గ్రామ గ్రామాన టీడీపీ వారే అట్టహాసంగా బెల్టుషాపులు ప్రారంభిస్తుండటం కన్పించ లేదా అంటూ విశ్వేశ్వర రెడ్డి ప్రశ్నించారు.

కూటమి సాయం నిల్...

- సాగుపై రైతుల్లో పెరుగుతున్న అనాసక్తి
- 'అనంత'లో 2022 ఖరీఫ్ కన్నా 1.96 లక్షల హెక్టార్లలో తగ్గిన సాగు విస్తీర్ణం
- శ్రీసత్యసాయి జిల్లాలో 2,90,549 హెక్టార్లు తక్కువగా పంటల సాగు
- బీమా, అన్నదాత సుఖీభవ, సూక్ష్మ సాగు ప్రయోజనాలపై స్పష్టత కరువు



అనంతపురం అగ్రికల్చర్: కూటమి సర్కార్ నుంచి ఎలాంటి సాయం అందకపోవడంతో పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. ఈ–క్రాప్ బుకింగ్ ద్వారా ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం పరిగణనలోకి తీసుకుంటే ఈ విషయం స్పష్టమవుతోంది. గత వైఎస్ జగన్ సర్కారు క్రమం తప్పకుండా రైతు భరోసా అందిస్తూ రావడంతో ఖరీఫ్, రబీ సాగుపై రైతులు ఆసక్తి చూపించారు. 2022 ఖరీఫ్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలు 12,50,887 హెక్టార్లలో సాగులోకి వచ్చినట్లు ఈ–క్రాప్ బుకింగ్ వివరాలు స్పష్టం చేస్తున్నాయి. అదే ఈ ఖరీఫ్‌లో పంటల సాగు విస్తీర్ణం 10,54,121 హెక్టార్లకు పరిమితమైంది. అంటే 2022 కన్నా ఏకంగా 1,96,765 హెక్టార్ల (4,91,912 ఎకరాలు)లో పంటలు సాగులోకి రాలేదు. ఇక శ్రీసత్యసాయి జిల్లాలో పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. 2022 ఖరీఫ్‌లో 8,03,677 హెక్టార్లలో పంటలు సాగు చేయగా... ఈ ఖరీఫ్‌లో 5,13,127 హెక్టార్లకు పరిమితమైంది. 2022 కన్నా 2,90,549 హెక్టార్ల (7,26,372 ఎకరాలు)లో పంటలు సాగులోకి రాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పశ్చిమ గోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాలు మినహా మిగిలిన 23 జిల్లాల్లో 2022 కన్నా తక్కువగానే పంటలు సాగులోకి వచ్చాయి. ఓవరాల్‌గా 2022 ఖరీఫ్‌లో 1,10,13,557 హెక్టార్ల క్రాప్ బుకింగ్ కాగా... ఈ ఖరీఫ్‌లో 13,30,252 హెక్టార్లు తక్కువగా 96,83,304 హెక్టార్లలో పంటలు సాగు చేసినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

సర్కారు సాయంపై పెదవి విప్పని సీఎం

కూటమి సర్కార్ ఏర్పడి ఐదు నెలలు కావస్తున్నా... రైతులకు ఎలాంటి సాయం అందించకుండా దగా చేయడంపై అన్నదాతలు మండిపడుతున్నారు. గతేడాదికి సంబంధించి ఉచిత పంటల బీమా పథకం కింద పెద్ద ఎత్తున పరిహారం అందాల్సి ఉన్నా.. సీఎం చంద్రబాబు పట్టించుకోవడం లేదంటూ వాపోతున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా 2023 ఖరీఫ్, రబీ పంటలు దారుణంగా దెబ్బతినడంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా ఉచిత పంటల బీమా కింద జూన్, జూలైలోనే పెద్ద ఎత్తున పరిహారం అందించినట్లు గుర్తు చేసుకుంటున్నారు. బీమా పరిహారం గురించి ఇప్పటి వరకూ కూటమి ప్రభుత్వం ఊసే ఎత్తకపోవడంతో పరిహారం కాస్త పరిహాసంగా మారింది. ఇక ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో హామీనిచ్చి రైతుల ఓట్లు కొల్లగొట్టిన చంద్రబాబు... అధికారం చేపట్టిన తర్వాత మిన్నకుండిపోయారు. పెట్టుబడిసాయం ఎపుడిస్తారో? ఎంత ఇస్తారో? అనేది స్పష్టత లేకుండా పోయింది. గత జగన్ ప్రభుత్వం ఏటా క్రమం తప్పకుండా జూన్, అక్టోబర్, జనవరిలో పెట్టుబడి సాయం అందిస్తూ వచ్చింది. కరోనా లాంటి కష్టకాలంలోనూ రైతు సంక్షేమాన్ని మరవకుండా అప్పటి సీఎం వైఎస్ జగన్ అందజేస్తూ వచ్చారని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. అలాగే డ్రిప్, స్ప్రింక్లర్లు పెద్ద ఎత్తున అందిస్తామని ఎన్నికల సమయంలో గొప్పగా చెప్పినా ఆచరణకు వచ్చే సరికి కూటమి సర్కార్ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. 37,500 హెక్టార్ల టార్గెట్ నిర్దేశించుకోగా... ఇప్పటి వరకూ 800 హెక్టార్లకు కూడా సూక్ష్మసాగు పరికరాలు ఇవ్వలేదు. ఇలా వ్యవసాయంతో పాటు ఉద్యానశాఖ, ఏపీఎంఐపీ, పశుసంవర్ధక, పట్టుపరిశ్రమశాఖ పరిధిలో ఉన్న రైతులను కూటమి సర్కార్ దారుణంగా వంచించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా

2 నుంచి హనుమద్ దీక్షలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: వచ్చే నెల 2వ తేదీ నుంచి హనుమద్ మండల దీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో దీక్షకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆలయ ఈఓ కె.వాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆంజనేయ స్వామి భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించే మండల దీక్షలు నవంబర్ 2వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయన్నారు. నవంబర్ 22వ తేదీన అర్ధమండల దీక్షలు ప్రారంభమవుతాయన్నారు. మండల, అర్ధమండల దీక్షలు చేపట్టే భక్తులు ఆయా తేదీల్లో ఆలయంలో మాలను ధరించవచ్చునని పేర్కొన్నారు. మండల దీక్షలు ముగిసిన అనంతరం డిసెంబర్ 12న ఇరుముడి సమర్పణలో భాగంగా తిరు ఉత్సవం కార్యక్రమం ఉంటుందన్నారు. డిసెంబర్ 13న హనుమద్ వ్రతంతో మండల దీక్షలు ముగుస్తాయన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుల అరెస్ట్

కణేకల్లు: మండలంలోని సొల్లాపురం, జక్కలవడికి గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. సొల్లాపురం గ్రామానికి చెందిన ప్రసాద్‌ను అరెస్ట్ చేసి 16 మద్యం బాటిళ్లు, అదే గ్రామ నివాసి చిట్టెమ్మను అరెస్ట్ చేసి 11 టెట్రా ప్యాకెట్ల మద్యం, జక్కలవడి గ్రామానికి చెందిన రామాంజినేయులుని అరెస్ట్ చేసి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

చేనేత క్లస్టర్ల ఏర్పాటుతో ఆర్థిక లబ్ధి

- జిల్లా చేనేత జౌళి శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ధనుంజయరావు



మాట్లాడుతున్న ధనుంజయరావు

రాయదుర్గం టౌన్: జిల్లాలోని చేనేతలు తమ పరిధిలో 50 నుంచి 60 మంది కలసి క్లస్టర్లు ఏర్పాటు చేసుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సంక్షేమ, ఆర్థిక లబ్ధి చేకూరుతుందని జిల్లా చేనేత జౌళి శాఖ డిప్యూటీ డైరెక్టర్ ధనుంజయరావు సూచించారు. రాయదుర్గంలోని 17వ సచివాలయంలో మంగళవారం చేనేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చేనేత పథకాలపై అవగాహన కల్పించారు. చేనేతజౌళీశాఖ డీఓ బసవరాజు, ఏడీఓ నరసింహారెడ్డి, సచివాలయ సిబ్బంది శ్రీనివాసులు, శివమూర్తి, రాజేంద్రప్రసాద్, నాగరాజు, దాదాపీర్ పాల్గొన్నారు.

నెట్టికంటుడి హుండీ ఆదాయం రూ.28.38 లక్షలు



హుండీ నగదును లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా రూ.28.38 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ కె.వాణి తెలిపారు. స్వామివారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం మంగళవారం ఆలయ ప్రాంగణంలో చేపట్టారు. 49 రోజులకుగాను రూ. 28,38,212 నగదు, 620 గ్రాముల వెండి, అన్నదానము హుండీ ద్వారా రూ.39,410 నగదు సమకూరింది. ఆలయ అధికారులు, సిబ్బంది, పోలీసులు తదితరులు హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. లెక్కింపు కార్యక్రమంలో గుంతకల్లు ఆర్టీసీ హనుమాన్ సేవాసమితి సభ్యులు, బళ్లారికి చెందిన వీరభద్రసేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మార్కుల పేరుతో ఐటీఐలో దందా

- పచ్చి బూతులు తిడుతూ విద్యార్థుల నుంచి నిర్బంధ వసూళ్లు
- అటెండెన్స్ తక్కువైతే ఇబ్బంది పడతారంటూ బెదిరింపులు
- వైరల్ అవుతున్న సంభాషణ

అనంతపురం ఎడ్యుకేషన్: పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించాల్సిన గురువే కాసులకు కక్కుర్తి పడి విద్యార్థులను పచ్చి బూతులతో సంబోధిస్తున్నాడు. మాటకు ముందు... వెనుక బూతు తప్ప మరో మాట రాదు. మార్కులు వేయాలంటే డబ్బులివ్వాలని, ఇన్సూరెన్స్ పాలసీలు చేయించాలంటూ బ్లాక్ మెయిల్‌కు దిగుతున్నాడు. ఇందుకు సంబంధించిన సంభాషణలు నెట్టింట్లో వైరల్ కావడంతో కలకలం రేగింది. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో పని చేస్తున్న ఫిట్టర్ అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ (ఏటీఓ) ఈశ్వరయ్య నిర్వాకం ఇది. 'ఈ రోజు రూ. 10 వేలు పెట్టి కళాశాల సీటు కొంటున్నారు. అలాంటిది మీకోర్సు పూర్తవుతోంది. మరో రూ. 5 వేలు ఎక్కువైనా ఇవ్వొచ్చు. డబ్బులు ఇచ్చి మంచి మార్కులు వేయించుకోండి. మంచి కంపెనీలను పిలిపిస్తాం. వాటిల్లో ఉద్యోగాలు ఇప్పించి మీ రుణాన్ని తీర్చుకుంటాం. అవసరం మీదే... ఆలోచించుకోండి. మీరిచ్చే మూడు బొట్ల గురించి ఆలోచించకుండా... ఉన్నది ఉన్నట్లు అటెండెన్స్ వేస్తే మీ పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి. అన్నీ ఆలోచించుకుని యవ్వారం చేయండి. లేదంటే మీకే నష్టం. మీకోసం తెగించి ఇలాంటి సాయం చేసేదే గొప్ప అని తెలుసుకోండి. ప్రెజెంట్ వేయాలంటే లెక్క కొట్టాలి' అంటూ ఓ విద్యార్థితో ఫోన్‌లో మాట్లాడాడు. మరో విద్యార్థిని రాయడానికి తీవ్ర ఇబ్బందిగా ఉండే పదాలతో దూషించాడు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ

ఏటీఓ ఈశ్వరయ్య సంభాషణలను రికార్డు చేసిన కొందరు విద్యార్థులు వారి తల్లిదండ్రులకు సమాచారం చెప్పారు. వారు నేరుగా అనంతపురం టూటౌన్ పోలీసులను కలిసి ఫిర్యాదు చేశారు. ఈశ్వరయ్య వ్యవహారాన్ని ఐటీఐ ప్రిన్సిపాల్ దృష్టికి పోలీసులు తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానంటూ ప్రిన్సిపాల్ హామీ ఇవ్వడంతో విద్యార్థులు కేసు పెట్టేందుకు నిరాకరించారు.

ఆది నుంచి వివాదాస్పదమే

ఈశ్వరయ్య 2010లో గుంతకల్లు ప్రభుత్వ ఐటీఐలో ఏటీఓగా కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగంలో చేరాడు. ఐదేళ్ల తర్వాత 2015లో ఓ విషయంలో అక్కడి ప్రిన్సిపాల్‌తో గొడవ పడడం, ఇతర ఆరోపణలపై ఆయనను ఉద్యోగం నుంచి తొలగించారు. తర్వాత కోర్టును ఆశ్రయించి 2018లో అనంతపురం ఐటీఐలో చేరాడు. ఇక్కడ చేరినప్పటి నుంచి విద్యార్థుల్లో గూపు రాజకీయాలు చేస్తూ అక్రమ వసూళ్లకు తెర లేపాడు. ఆయన నోటి నుంచి లం.... కొడకా అనే మాటలే వస్తాయని విద్యార్థులు వాపోతున్నారు. ఈశ్వరయ్యపై అన్ని ఆరోపణలున్నా యాజమాన్యం నిర్లక్ష్యం చేయడంతో ఆయన మరింత రెచ్చిపోతూ వచ్చాడంటున్నారు. ఒకరిద్దరు విద్యార్థులను ముందు పెట్టి వారితోనే అటెండెన్స్ పేరుతో వసూళ్లు, పాలసీలు కట్టించాలంటూ ఒత్తిళ్లు చేయిస్తున్నారు. కాగా రెండు రోజులుగా ఈశ్వరయ్య విధులకు గైర్హాజరవుతున్నాడు.

డిప్యూటీ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం

ఏటీఓ ఈశ్వరయ్యపై వచ్చిన ఆరోపణల విషయాన్ని డిప్యూటీ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయనకు షోకాజ్ నోటీసు ఇవ్వబోతున్నాం. విద్యార్థులు మా దృష్టికి ముందే తీసుకు వచ్చింటే ఈ పరిస్థితి ఉండేది కాదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఈశ్వరయ్యపై చర్యలు తీసుకుంటాం. – రామమూర్తి, ప్రిన్సిపాల్

కూతురిని పరీక్షకు తీసుకెళుతూ తండ్రి దుర్మరణం



హేమాద్రి (ఫైల్)

గోనెగండ్ల: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్ష రాయించేందుకు కుమార్తెను పిలుచుకెళుతుండగా చోటు చేసుకున్న ప్రమాదంలో తండ్రి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామానికి చెందిన కుమ్మరి హేమాద్రి (38) తన కుమార్తె త్రివేణిని ఉన్నత ఉద్యోగంలో చూడాలని తపన పడ్డాడు. ఈ క్రమంలో కుమార్తెను స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్ష రాయించేందుకు సోమవారం కొనకొండ్ల నుంచి బయలుదేరారు. పత్తికొండలోని స్నేహితుడి ఇంటికి వెళ్లి రాత్రి బస చేసి మంగళవారం ఉదయం స్నేహితుడి కారు (ఏపీ 21 సీఈ 8551)లో డ్రైవర్‌తో పాటు తన కుమార్తె, కుమారుడితో కలసి కర్నూలుకు హేమాద్రి బయలుదేరారు. ఎస్.లింగందిన్నె క్రాస్ రోడ్డులోని భారత్ పెట్రోల్ బంక్ వద్దకు చేరుకోగానే హారన్ ఇవ్వకుండా వేగంగా దూసుకొచ్చిన లారీ (టీఎస్ 12 ఈయూ 9558) వెనుక నుంచి కారును ఢీకొంది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురూ గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కోలుకోలేక హేమాద్రి మృతి చెందాడు. మృతుడి భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలను చైతన్య పరచండి

శింగనమల: మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులపై ప్రజలను చైతన్య పరచాలని వైద్య సిబ్బందికి మలేరియా, ఫైలేరియా నియంత్రణ రాష్ట్ర కన్సల్టెంట్ రామచంద్రుడు సూచించారు. శింగనమల మండలం చక్రాయపేట, సి.బండమీదపల్లి గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. నీటి నిల్వలున్న ప్రాంతాలను పరిశీలించారు. నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. దోమల లార్వాలు వృద్ధి చెందకుండా అబెట్ మందును పిచికారీ చేయాలన్నారు. మలేరియా జ్వరాలు ప్రబలకుండా గ్రామంలో ఫాగింగ్ చేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా సహాయక అధికారి సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి గంగాధర్, సూపర్‌వైజర్లు అశ్వత్థనారాయణ, నూర్‌బాషా, శ్రీధర్‌మూర్తి, హెల్త్ ప్రొవైడర్ అప్సరభాను, ఆరోగ్య కార్యకర్తలు హేమలత, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూ బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక



క్రీడాకారులతో రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు

అనంతపురం: బెంగళూరులోని క్రిస్ట్ యూనివర్సిటీ వేదికగా నవంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు జరిగే దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల బాస్కెట్ బాల్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించే ఎస్కేయూ జట్టును మంగళవారం ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో గుర్రం రాజేష్, కె.మహమ్మద్ ఉమర్, కె.హెచ్.సాయి సంజన్ (ఎస్ఎస్‌బీఎన్), జి.రాజశేఖర్, బి.సాయికుమార్ (ఎస్కేయూ), ఎం.నవీన్ (ఎస్వీ డిగ్రీ కళాశాల, అనంతపురం), ఎం.అనిల్‌కుమార్ యాదవ్, కె.మహమ్మద్ ఆరీఫ్ (ఆర్ట్స్ కళాశాల, అనంతపురం), ఎస్.విశాల్ (పీవీకేకే), ఎం.రవికుమార్ (ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల), వై.గణేష్ (కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల) ఉన్నారు. ఎంపికైన వారిని ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, వర్సిటీ క్రీడా కార్యదర్శి డాక్టర్ బి.జెస్సీ అభినందించారు.

ఆటోను ఢీకొన్న సీఐ కారు

- విద్యార్థి దుర్మరణం
- చికిత్స పొందుతూ మరొకరి మృతి
- ముగ్గురికి గాయాలు



విష్ణువర్ధన్ (ఫైల్)

ముదిగుబ్బ: ఆటో, కారు ఢీకొన్న ఘటనలో ఓ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం డీపీఓలో వీఆర్‌లో ఉన్న సీఐ హారూన్‌బాషా మంగళవారం మధ్యాహ్నం అనంతపురం నుంచి కారులో కదిరి వైపుగా బయలుదేరారు. ముదిగుబ్బ మండలం నాగారెడ్డిపల్లి బ్రిడ్జి వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న నల్లమాడకు చెందిన విద్యార్థి విష్ణువర్ధన్ (19) అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న హారూన్‌బాషాతో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న నాగారెడ్డిపల్లికి చెందిన నరసింహులు, ముదిగుబ్బ మండలం పాముదుర్తి కొట్టాలకు చెందిన రాములు నాయక్, లక్ష్మీబాయి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లక్ష్మీబాయి (52) మృతి చెందారు. ఘటనపై పట్నం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడు విష్ణువర్ధన్ కదిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం కళాశాలకు హాజరైన విష్ణువర్ధన్... మధ్యాహ్నం స్వగ్రామానికి ఆటోలో వెళుతూ ప్రమాదంలో మృతి చెందడంతో నల్లమాడలో విషాదఛాయలు అలుముకున్నాయి.

హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని పెంచాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



హంద్రీనీవా ఈఈతో మాట్లాడుతున్న రామకృష్ణ

గుంతకల్లు/ఉరవకొండ: హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని రెండింతలు పెంచి కరువు పీడిత రాయలసీమ జిల్లాలను సశ్యశామలం చేయాలని కూటమి ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. గుంతకల్లు మండలంలో హంద్రీ–నీవా, ఉరవకొండ మండలం నింబగల్లు వద్ద హెచ్చెల్సీ కెనాల్, జీబీసీ హెడ్‌ను మంగళవారం సీపీఐ నాయకులతో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం హంద్రీ–నీవా ఈఈ శ్రీనివాస్‌నాయక్‌ను పిలిపించుకుని హంద్రీ–నీవా కాలువలో ప్రస్తుత నీటి ప్రవాహ సామర్థ్యం, ప్రస్తుతం ఎంత మేర నీరు రావాలి? ఎంత మేర అందుతోంది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద మొత్తం సముద్రం పాలైందన్నారు. తుంగభద్ర డ్యామ్ నుంచి హెచ్చెల్సీ ద్వారా నీరు తీసుకుని ఉంటే గుంతకల్లు సబ్ బ్రాంచ్ కెనాల్‌తో పాటు ఆలూరు బ్రాంచ్ కెనాల్‌కు కేటాయించిన వాటా పూర్తి స్థాయిలో దక్కేదన్నారు. అయితే ఆశించిన మేర నీరు సేకరించుకోకపోవడంతో హంద్రీ–నీవా కాలువ నుంచి ఈ రెండు సబ్ కెనాల్‌కు నీటిని మళ్లించే పరిస్థితి నెలకొందన్నారు. హంద్రీనీవా కెనాల్ ద్వారా 6.40 లక్షల ఎకరాలకు సాగునీరు. 30 లక్షల మందికి తాగునీరు ఇచ్చే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ విషయంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవ తీసుకుని నవంబర్‌లో ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో హంద్రీ–నీవా మరమ్మతులకు రూ.2 వేల కోట్లు కేటాయించాలన్నారు. అంతేకాక హెచ్చెల్సీలో నీటి ప్రవాహ సామర్థ్యాన్ని రెండింతలు చేసేలా పనులు చేపట్టేందుకు ఈ బడ్జెట్‌లోనే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, ఉరవకొండ తాలూకా కార్యదర్శి మల్లికార్జున, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం



భారతి (ఫైల్)

రాప్తాడు రూరల్: ఆత్మహత్య ఎలా చేసుకోవాలి? అంటూ గ్రామస్తులను విచారించి, చివరకు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం రూరల్ మండలం పూలకుంటకు చెందిన కురుబ భారతి (42)ని బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన బచ్చలన్నకు ఇచ్చి పెళ్లి చేశారు. వీరి కుమార్తెను పూలకుంట గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి పెళ్లి జరిపించారు. కొన్నేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతున్న భారతిని భర్త వదిలేశాడు. అప్పటి నుంచి పుట్టింట్లోనే ఆమె ఉంటోంది. ఇటీవల తల్లి కూడా మృతి చెందింది. తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. భారతి కుమార్తెకు పుట్టిన బిడ్డ కూడా ఇటీవల చనిపోయింది. ఈ పరిణామాలు భారతిని మరింత కుంగదీశాయి. ఈ క్రమంలో నాలుగు రోజులుగా ఆత్మహత్య ఏ రీతిలో చేసుకుంటే బాగుంటుందంటూ విచారిస్తున్న ఆమెను స్థానికులు మందలించి, సర్ది చెప్పారు. అయినా ఆమెలో మార్పు రాలేదు. మంగళవారం ఉదయం అనంతపురానికి వెళ్లిన ఆమె తిరిగి వచ్చే సమయంలో ఓ బాటిల్‌లో పెట్రోలు తెచ్చుకుంది. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుంది. మంటల వేడికి తాళలేక గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని తలుపులు బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించారు. అప్పటికే మంటల్లో పూర్తిగా కాలి మృతి చెందింది. సమాచారం అందుకున్న ఇటుకలపల్లి పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

జలవనరుల శాఖ సీఈగా నాగరాజు

అనంతపురం సెంట్రల్: విజయవాడ ఈఎన్‌సీ ఇన్‌చార్జ్ ఎస్ఈ నాగరాజుకు అడహక్ పదోన్నతి కల్పిస్తూ జలవనరులశాఖ సీఈగా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

డిసెంబర్ ఆఖరుకల్లా బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

అనంతపురం సిటీ: డిసెంబర్ నెలాఖరుకల్లా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు అందుబాటులోకి రానున్నట్లు ఆ శాఖ జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా తెలిపారు. అనంతపురంలోని జిల్లా కార్యాలయంలోని తన చాంబర్‌లో సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 324 బీఎస్ఎన్ఎల్ టవర్లు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకూ ఇతర ఏ నెట్‌వర్క్ సౌకర్యం లేని 15 గ్రామాల్లో కొత్తగా 4జీ సేవలతో బీఎస్ఎన్ఎల్ టవర్లు నిర్మించినట్లు వివరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 122 టవర్లను 4జీగా మార్పు చేసినట్లు తెలిపారు. అక్టోబర్ నెలాఖరుకల్లా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4జీ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించగా, సాంకేతిక కారణాలతో ఆలస్యమవుతోందన్నారు. డిసెంబర్ నెలాఖరు నాటికి ఉమ్మడి జిల్లా అంతటా 4జీ, 5జీ సేవలు కూడా అందేలా యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నట్లు వెల్లడించారు.

వ్యక్తి ఆత్మహత్య



వెంకటేష్ (ఫైల్)

గుత్తి: మండలంలోని గొందిపల్లికి చెందిన వెంకటేష్ (35) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బొలెరో వాహన డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకున్న వెంకటేష్ ఆరోగ్యం ఇటీవల క్షీణించింది. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన మంగళవారం పురుగుల మందు తాగాడు. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతిచెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కందిలో సస్యరక్షణ చేపట్టండి

- శాస్త్రవేత్తలు విజయశంకరబాబు, నారాయణస్వామి



అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌లో లక్ష హెక్టార్లలో సాగు చేసిన కంది పంట ఆశాజనకంగా ఉన్నందున మంచి దిగుబడుల కోసం మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వి జయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వారు వివరించారు.

- పూత దశలో మారుకామచ్చ పురుగు కనిపిస్తే లీటర్ నీటికి 5 శాతం వేపనూనె (అజాడిరాక్టిన్ 1500 పీపీఎం)ను 5 మి.లీ. కలిపి చల్లాలి. పురుగు ఉధృతిని బట్టి లీటర్ నీటికి 0.3 మి.లీ. స్పైనోసాడ్ లేదా 0.4 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్ లేదా 0.3 మి.లీ. క్లోరాంట్రానిలిప్రోల్ కలిపి మొక్కలు బాగా తడిచేలా పిచికారీ చేయాలి.
- శనగపచ్చ పురుగు లేత కాయ, పూత దశలో ఆశిస్తుంది. పూత, పూమొగ్గల మీద విడిగా గుడ్లు పెడుతుంది. తొలిదశలో లేత ఆకులు, పూలను తినేస్తుంది. కాయలు ఏర్పడే దశలో ఆశిస్తే కాయలోపలికి సగభాగం చొచ్చుకెళ్లి మిగిలిన భాగం బయట ఉంచి గింజలను తినేస్తుంది. గింజ పరిమాణం తగ్గి నాణ్యత లేకుండా పోతుంది. పూత ఏర్పడే దశలో ఎకరాకు 20 వరకు 'వై' ఆకారం ఉన్న పంగల కర్రలను ఏర్పాటు చేసుకోవాలి. ఉధృతిని బట్టి ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. నష్టపరిమితి స్థాయిని బట్టి లీటర్ నీటికి 0.5 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్ లేదా 0.3 మి.లీ. క్లోరాంట్రానిలిప్రోల్ కలిపి పిచికారీ చేయాలి.
- బెట్ట పరిస్థితులు, మరికొన్ని కారణాల వల్ల కాయతొలిచే ఈగ పూత, లేత కాయలు, పిందెల్లోకి చేరి గుడ్లు పెడుతుంది. వీటి నుంచి పొదిగిన తెల్లని పిల్లపురుగులు గింజలను తింటూ గింజల మీద తెల్లటి చారలను ఏర్పరుస్తాయి. ఇది ప్రధానంగా దీర్ఘకాలిక కంది రకాలను ఆశిస్తుంది. గింజ గట్టి పడే దశలో లీటర్ నీటికి 2 మి.లీ. డయోమిథోయేట్ లేదా 2 మి.లీ. ప్రొఫినోఫాస్ లేదా 0.7 మి.లీ. థయక్లోప్రిడ్ లేదా 0.4 గ్రాముల థయోమిథాక్సామ్ లేదా 1 మి.లీ. లుఫెనురోన్ కలిపి పిచికారీ చేయాలి.

క్లుప్తంగా

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఎస్పీ పి.జగదీష్ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసు కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్పీ సాధారణ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులకు ఉచితంగా ఈసీజీ, 2డీ ఎకో, డెంటల్, కంటి, బీపీ తదితర పరీక్షలు ఆయా విభాగాల వైద్యులు, సిబ్బంది నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో తమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ ఏటా పోలీసు సంస్మరణ వారోత్సవాలు అక్టోబర్ 21 నుంచి 31 వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ఎస్ఐ జాఫర్, జిల్లా కమిటీ సభ్యులు సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

అనంతపురం: తపోవనంలో వ్యభిచారం నిర్వహిస్తున్న గృహంపై మంగళవారం నాలుగో పట్టణ ఎస్ఐ విజయభాస్కర్‌నాయుడు, పోలీసు సిబ్బంది దాడి చేశారు. ఒక మహిళ, ఒక విటుడు, నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సాయినాథ్ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధ్యాయ సమస్యలపై వినతి



డీఈఓ ప్రసాద్‌బాబును సన్మానిస్తున్న వైఎస్సార్‌టీఏ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: కొత్తగా బాధ్యతలు చేపట్టిన డీఈఓ ప్రసాద్‌బాబును మంగళవారం వైఎస్సార్‌టీఏ నాయకులు కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అనంతరం వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగిరెడ్డి, రాష్ట్ర నాయకులు గోవిందరెడ్డి, రమణప్ప, జిల్లా నాయకులు ఎ.గోపాల్, హెచ్.రామకృష్ణ, సిద్ధప్రసాద్, సుభహాన్, కృష్ణానాయక్, ఎస్.వెంకటరెడ్డి, చెన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

త్వరలో రాయలసీమ నాటక రచనా పోటీలు

అనంతపురం కల్చరల్: రాయలసీమ సమాజం, జీవన సంస్కృతి నేపథ్యంగా త్వరలో ఏకాంకిక, నాటిక, నాటక రచనా పోటీలు నిర్వహించనున్నట్లు రాయలసీమ సాంస్కృతిక వేదిక సమన్వయకర్త డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి తెలిపారు. డాక్టర్ ఎం.వి.రమణారెడ్డి స్మారకంగా నిర్వహించే ఈ పోటీల్లో రచయితలు విరివిగా పాల్గొని డిసెంబరు నెలలోపు తమ రచనలను పంపాలని కోరారు. రూ.15 వేల నగదు బహుమతులను అందిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 99639 17187 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన డీఈఓ



అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న ఎం.ప్రసాద్‌బాబు మంగళవారం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

అక్రమ మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యం చూపుతున్న ఎక్సైజ్ సీఐ, ఎస్ఐ సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: చెన్నేకొత్తపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కనగానపల్లి మండలంలోని మద్దెల చెరువులో ఎక్సైజ్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ ఫరూఖాజం, ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన మేరకు గ్రామానికి చెందిన కొడిదల గోపాల్ వద్ద నుంచి కర్ణాటక మద్యం 45 టెట్రా ప్యాకులు, 8 ఆంధ్ర బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ చంద్ర, కానిస్టేబుళ్లు శంకర్‌నాయక్, నాగార్జున పాల్గొన్నారు.

సురక్షిత ప్రమాణాలు పాటించరా?

- సర్వజనాస్పత్రి డైట్ సెంటర్‌లో నాణ్యత డొల్ల
- ఎస్ఎస్ పాలెస్‌లో నిల్వ ఉన్న పన్నీర్
- ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారుల మెరుపుదాడుల్లో బట్టబయలు



సర్వజనాస్పత్రి డైట్ సెంటర్‌లో నాణ్యత ప్రమాణాలను పరిశీలిస్తున్న ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి తస్లీం



ఎస్ఎస్ ప్యాలెస్‌లో పన్నీర్‌ను స్వాధీనం చేసుకుంటున్న అధికారి

అనంతపురం మెడికల్: తినుబండారాల తయారీలో సురక్షిత ప్రమాణాలు పాటించకపోతే ఎలా అంటూ ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు మండిపడ్డారు. నగరంలోని రెస్టారెంట్, బేకరీ, సర్వజనాస్పత్రి డైట్ సెంటర్‌లపై ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు మంగళవారం మెరుపుదాడులు చేశారు. పలువురి ఫిర్యాదుల మేరకు ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి తస్లీమ్ నేతృత్వంలో పై వాటిని తనిఖీ చేశారు. సర్వజనాస్పత్రిలో రోగులకందించే డైట్ సెంటర్‌లో సురక్షిత ప్రమాణాలు పాటించడం లేదని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కూరల్లో దెబ్బతిన్న క్యారెట్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. డైట్‌సెంటర్ కిటికీలకు మెష్ లేకపోవడంతో పురుగులు కూరగాయలపై వాలుతున్న వీడియోలను తీసుకున్నారు. వైద్యులకు చిక్కటి పప్పు, రోగులకు నీళ్ల పప్పు సరఫరా చేయడంపై డైట్ సెంటర్ నిర్వాహకుడు చంద్రశేఖర్‌రెడ్డిని ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి నిలదీశారు. పప్పు నాణ్యతగా ఇవ్వాలన్నారు. మరకలు ఉన్న కోడిగుడ్లను ఎందుకు వినియోగిస్తున్నారని ప్రశ్నించారు. అటువంటి గుడ్లను వాడడం వల్ల రోగులకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. గోధుమ పిండి, పెరుగు శ్యాంపిళ్లను సేకరించారు.

ఎస్ఎస్ ప్యాలెస్‌లో పన్నీర్, రైతా స్వాధీనం

నగరంలోని ఎస్ఎస్ ప్యాలెస్‌లో పన్నీర్, రైతాను ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి స్వాధీనం చేసుకున్నారు. పన్నీర్‌ను ఓపెన్ చేసి ఉంచడాన్ని ఆమె తప్పుబట్టారు. ఇలా చేయడం ద్వారా బ్యాక్టీరియా ఏర్పడే అవకాశం ఉందన్నారు. రైతా నీళ్లలా చేశారేంటని ప్రశ్నించారు. అనంతరం నగరంలోని పార్క్‌లేన్ బేకరీని పరిశీలించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. సేకరించిన తినుబండారాల నమూనాలను ల్యాబ్‌కు పంపుతామన్నారు. అక్కడి నుంచి వచ్చే నివేదిక ఆధారంగా కేసు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫుడ్ అండ్ సేఫ్టీ సిబ్బంది శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించండి



డీఈఓ ప్రసాద్‌బాబుకు బొకే అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి బొకే అందజేసిన అనంతరం వినతిపత్రం అందజేశారు. ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ టీచర్ల రెగ్యులరైజేషన్, సీనియారిటీ లిస్టులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం చేపట్టిన మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులు పారదర్శకంగా చేపట్టాలని కోరారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, దీర్ఘకాలంగా కోర్టు కేసులతో పెండింగ్ లో ఉన్న ఇంగ్లిష్ టీచర్ల పదోన్నతులు తక్షణమే ఇవ్వాలని కోరారు. ఒకే సారి పదోన్నతులు పొందిన వారికి జాయినింగ్ తేదీ కామన్‌గా జిల్లా అంతా ఒకే తేదీ ఉండేలా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి ఎస్.రామాంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి కె.చంద్రశేఖర్, సీనియర్ నాయకులు జె.రామన్న, ఎ.అజయ్ కుమార్, ఏపీ మోడల్ స్కూల్ ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మరాజు, నాయకులు పాల్గొన్నారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ రానీయొద్దు



మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీనరసింహ

ఆత్మకూరు: జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన ఆలయాల్లో పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఒకటి. అలాంటి ఈ ఆలయానికి భక్తులు ప్రతి, ఆది, మంగళవారాల్లో వేల సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. వచ్చే నెల 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకు కార్తీకమాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యాలు కలగరాదని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ తెలిపారు. మంగళవారం పంపనూరు గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మండల స్థాయి అధికారులతో, పంచాయతీ సెక్రటరీలకు, ఆలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కార్తీక మాస ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు తాగునీరు అందుబాటులో ఉంచేయాలా చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనాయక్, డాక్టర్ సబిహా సుల్తానా, ఆలయ ఈఓ బాబు, పంచాయతీ సెక్రటరీ శిరీష, వీఆర్వో ప్రసాద్, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి



మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ జమీల్ అహమ్మద్

ఆత్మకూరు: మండలంలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ జమీద్ అహమ్మద్, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బందికి ఇంటి నిర్మాణాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ ఇళ్లు 511 అసంపూర్తిగా ఉన్నాయన్నారు. లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. ఆర్‌సీ(స్లాబ్) వరకు వచ్చినవి డిసెంబర్‌లోపు, మిగిలిన ఇళ్లు వచ్చే ఏడాది మార్చిలోపు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి సుమన జయంతి, ఈవోఆర్డీ కామక్షి, ఈసీ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

టపాసుల విక్రయాలపై జీఎస్టీ మినహాయించండి

అనంతపురం అర్బన్: బాణాసంచా విక్రయాలపై జీఎస్టీ మినహాయించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు దుకాణ అనుమతులు పొందిన విక్రయదారులు విన్నవించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను వ్యాపారులు కలిసి వినతిపత్రం సమర్పించి, మాట్లాడారు. బాణాసంచా విక్రయాలపై జీఎస్టీ చెల్లిస్తేనే అనుమతి ఇస్తామంటూ ఇప్పుడు ఇప్పుడు నోటీసు ఇవ్వడం సబబు కాదన్నారు. పండుగకు ఒక్కరోజు ముందు ఇలా ఇస్తే తామెలా వ్యాపారం చేసుకోవాలని అడిగారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సమస్యను ఆర్డీఓ వసంతబాబుకు ఎండార్స్ చేశారు. కాగా, దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా విక్రయాలకు సంబంధించి తాత్కాలిక లైసెన్స్ పొందిన వ్యాపారులు గతంలోనూ జీఎస్టీ చెల్లించారు. తాత్కాలిక లైసెన్స్ పొందిన వ్యాపారులు తాము వ్యాపారం నిర్వహించేందుకు జీఎస్టీ చెల్లించి చలానాను సమర్పించిన అనుమతి పొందేవారు. వ్యాపారం ఎంత జరిగిందనేది కాకుండా ఒక మొత్తానికి జీఎస్టీని వాణిజ్య పనులు శాఖ వసూలు చేసి చలానా ఇచ్చేది. గతం నుంచి ఇదే విధానం అమలులో ఉంది. అయితే ప్రస్తుతం తమ వ్యాపారాలకు జీఎస్టీ మినహాయింపును కోరుతూ అనుమతులు పొందిన వారు విన్నవించారు.

విధులకు సక్రమంగా హాజరు కాకపోతే చర్యలు



హంపాపురం సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మి

రాప్తాడు: గ్రామ సచివాలయ ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కాకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని హంపాపురం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సచివాలయంలో హాజరుపట్టికతోపాటు రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలను అందిచడానికే గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం హంపాపురం, రామినేపల్లి గ్రామాల్లో చేపడుతున్న సీసీ రోడ్లను పరిశీలించారు.

స్కూటా ప్రెసిడెంట్‌గా చిట్టా సురేష్



ప్రొఫెసర్ చిట్టా సురేష్



డాక్టర్ ఎంవీ శ్రీనివాసన్



డాక్టర్ వి. మాధవి

అనంతపురం: స్కూటా (శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్) నూతన ప్రెసిడెంట్‌గా ప్రొఫెసర్ చిట్టా సురేష్ (బయో కెమిస్ట్రీ) ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. స్కూటా కార్యవర్గ సమావేశం మంగళవారం యూనివర్సిటీలోని ఉపాధ్యాయ భవన్‌లో జరిగింది. నూతన ప్రెసిడెంట్, సెక్రెటరీ, ఈసీ మెంబర్లను ఎంపిక చేశారు. నూతన సెక్రెటరీగా ప్రొఫెసర్ ఎంవీ శ్రీనివాసన్ (ఫిజికల్ ఎడ్యుకేషన్), జాయింట్ సెక్రెటరీగా డాక్టర్ వూటికంటి మాధవి (ఇంగ్లిష్), ట్రెజరర్‌గా డాక్టర్ ఎం.శ్రీరాములు (లా), ఈసీ మెంబర్లుగా ప్రొఫెసర్ గీతాంజలి (కంప్యూటర్ సైన్సెస్), ప్రొఫెసర్ వెంకటరమణ (కెమిస్ట్రీ), ప్రొఫెసర్ ఎస్.ఆర్ .సదాశివా రెడ్డి (తెలుగు), డాక్టర్ నరేంద్ర మద్దు (బయో కెమిస్ట్రీ) ఎంపికయ్యారు.

నేత్రపర్వంగా ధనత్రయోదశి వేడుకలు



పూజలందుకున్న మంజునాథేశ్వరుడు

అనంతపురం కల్చరల్: హెచ్చెల్సీ కాలనీలో కొలువైన అన్నపూర్ణ మంజునాథేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ధనత్రయోదశి వేడుకలు నేత్రపర్వంగా సాగాయి. ప్రధాన అర్చకులు బసవరాజస్వామి నేతృత్వంలో ఉదయం అనంత ఐశ్వరేశ్వర స్వామికి, శివపార్వతులకు మహా రుద్రాభిషేకం, లక్ష్మీపూజల అనంతరం ప్రసాద వితరణ జరిగింది. శివస్వాములు రుద్రం, చమకం పఠనం చేశారు. ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ బుధవారం ఉదయం గోపుర కలశ స్థాపన, విశేష హోమాలు, ప్రత్యేక పూజలు, అన్నదాన ప్రసాదం ఉంటాయని భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



మార్కెట్‌లో చెత్తను తొలిగిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: కేంద్ర యువజన, క్రీడా సంస్థ ఆదేశాల మేరకు 'దివాలి విత్ మై భారత్' క్యాంపెయిన్‌లో భాగంగా స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతపై నగరంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ నెల 27 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమాలు బుధవారంతో ముగియనున్నాయి. మంగళవారం పాతూరులో ట్రాఫిక్ వాలంటరింగ్ చేశారు. అలాగే పాతూరు మార్కెట్‌లో చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ విష్ణుప్రియ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సంతోష్‌నాయక్, వెంకట్, రోజా, చందన, తేజశ్విణి పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ ఎ.చంద్రమోహన్

అనంతపురం: నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుంటే పనిచేస్తున్న కంపెనీ పురోగతి చెందుతుందని కేంద్రీయ విశ్వవిద్యాలయం (చెన్నై) ప్రొఫెసర్ ఎ.చంద్రమోహన్ అన్నారు. జేఎన్‌టీయూఏ ఎంబీఏ విభాగంలో మంగళవారం 'స్కిల్ డెవలప్‌మెంట్ మేనర్–లీడర్‌షిప్ క్వాలిటీస్' అంశంపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. పోటీ ప్రపంచంలో నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాభివృద్ధి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ టి.నారాయణరెడ్డి, డాక్టర్ మహమ్మద్, డాక్టర్ బీసీ లక్ష్మన్న, డాక్టర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బిగ్‌డేటా, ఏఐపై దృష్టి సారించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు

అనంతపురం: బిగ్‌డేటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, బ్లాక్ చైన్ టెక్నాలజీ వంటి ఎమర్జింగ్ టెక్నాలజీపై దృష్టి సారించాలని కంప్యూటర్ సైన్సెస్ విద్యార్థులకు జేఎన్‌టీయూఏ ఇన్‌చార్జ్ వీసీ హెచ్.సుదర్శనరావు సూచించారు. జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలోని కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో ఫిక్సెల్–2024 జాతీయ సదస్సును మంగళవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య విశిష్ట అతిథిగా హాజరై ప్రసంగించారు. సదస్సుకు డాక్టర్ ఏపీ శివకుమార్, డాక్టర్ కేఎఫ్ భారతి కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి అధ్యక్షత వహించారు.

స్నేహితుడిని కలవడానికి వచ్చి మృత్యు ఒడిలోకి..



మృతి చెందిన హరి

కురబలకోట: స్నేహితుడిని కలవడానికి అనంతపురం నుంచి అంగళ్లు ప్రాంతానికి వచ్చిన ఓ యువకుడు మూర్ఛ వ్యాధితో మృత్యు ఒడికి చేరాడు. ముదివేడు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురానికి చెందిన హరి (21) చిత్తూరు జిల్లా అంగళ్లులోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న స్నేహితుడిని కలవడానికి మంగళవారం వచ్చాడు. అనంతరం బస్ స్టాపు వద్ద నిలబడి ఉండగా మూర్ఛ (ఫిట్స్) వచ్చి కుప్పకూలాడు. హుటాహుటిన హరిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

దేశ శ్రేయస్సు, సమగ్రతపై అవగాహన



పెద్దకొండాపురంలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ సిబ్బంది

రామగిరి: మండలంలోని పెద్దకొండాపురంలో దేశ శ్రేయస్సు, సమగ్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ ఆధ్వర్యంలో ఏటా సెప్టెంబర్ 28 నుంచి నవంబర్ 3వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో భాగంగా పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సంస్థ సిబ్బంది పాల్గొని, ప్రజలకు అవగాహన కల్పించారు.

అన్నిదానాల్లో కంటే రక్తదానమే మిన్న

రామగిరి: అన్నిదానాల్లో కంటే రక్తదానమే మిన్న అని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం రామ గిరిలో పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మండలంలోని యువకులు అధిక సంఖ్యలో పాల్గొని, రక్తదానం చేశారు. కార్యక్రమంలో ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, సీఐ శ్రీధర్, ఎస్ఐ సుధాకర్‌యాదవ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజు మంగళవారం నగరంలోని మారుతినగర్, లక్ష్మీనగర్‌లో జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. రోడ్డుపై చెత్త కన్పించకూడదని, ఎప్పటికప్పుడు కంపోస్టుయార్డుకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు.

ఇనుపచువ్వ గుచ్చుకుని బాలుడి మృతి

అనంతపురం: గుల్జార్‌పేటలో నివాసం ఉంటున్న మహమ్మద్ బాషా కుమారుడు మహమ్మద్ సాదిక్ (17) సోమవారం రాత్రి మూడో అంతస్తుపైన గోడమీద కూర్చుని అదుపుతప్పి వెనక్కుపడటంతో సిమెంటుపిల్లర్‌కు ఉన్న ఇనుపచువ్వ కడుపులో గుచ్చుకుని మృతి చెందాడు. ఇతడికి మతిస్థిమితం సరిగా లేదు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

● కుక్కలు బాబోయ్...

అనంతపురంలోని అశోక్‌నగర్‌లో వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు నిత్యం కలెక్టరేట్‌కు రాకపోకలు సాగించే మార్గంలోనే కుక్కలు సంచరిస్తూ వాహనదారులను తికమక పెడుతున్నాయి. కుక్కలు వెంటపడుతుండడంతో పలువురు ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయపడిన ఘటనలూ ఉన్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



సాంకేతిక పురోగతితోనే దేశాభివృద్ధి



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు

అనంతపురం: సాంకేతిక పురోగతితోనే దేశాభివృద్ధి సాధ్యమని జేఎన్‌టీయూ(ఏ) ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు అన్నారు. జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాలలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో మంగళవారం 'డైనమిక్స్–2కే24' సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇన్‌చార్జ్ వీసీ హాజరై మాట్లాడారు. కోర్ బ్రాంచ్‌లతో అపారమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పారిశ్రామిక విప్లవం 4.0తో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. మెకానికల్ ఇంజినీరింగ్‌లో స్మార్ట్‌మెషిన్, డిజిటలైజేషన్‌ను ఉపయోగిస్తున్నారని, ఇందులో నిష్ణాతులు కావాలని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి తోడ్పడే వినూత్న పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా డైనమిక్స్ సావనీర్‌ను ఆవిష్కరించారు. విశిష్ట అతిథిగా డాక్టర్ సి.హరివెంకటేశ్వరరావు (జాయింట్ డైరెక్టర్ ఆఫ్ డీఆర్‌డీఓ, హైదరాబాద్), ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి, కోఆర్డినేటర్లు డాక్టర్ బి.చంద్రమోహన్‌రెడ్డి, డాక్టర్ బి.ఓంప్రకాష్, విభాగాధిపతి డాక్టర్ కళ్యాణిరాధ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం



గరిమేకలపల్లిలో ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రామగిరి: మండలంలోని గరిమేకలపల్లి, ఎంసీపల్లి గ్రామాల్లో అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ మండల నాయకులు మంగళవారం ఆర్థికసాయం అందించారు. ఎంసీపల్లిలో మాలముత్యాలు, గరిమేకలపల్లిలో హరిజన వెంకటరాముడు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున అందించారు. మొత్తాన్ని జెడ్పీటీసీ గోసే నాగార్జున, సర్పంచులు మీనుగ నాగరాజు, సిద్ధన్న, మ ండల అగ్రిబోర్డ్ చైర్మన్ నరసింహారెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, రామ్మోహన్ తదితరులు అందించారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు



రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో కేజీబీవీ ఎస్ఓ, పీఈటీ

కనగానపల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఎస్ఓ నరసమ్మ తెలిపారు. మంగళవారంస్థానిక పాఠశాలలో ఎస్ఓ మాట్లాడుతూ ఏపీ స్కూల్ గేమ్స్‌లో జిల్లా స్థాయిలో జరిగిన స్కిప్పింగ్ పోటీల్లో ఏడుగురు విద్యార్థినులు పాల్గొని ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరిలో అండర్– 14 విభాగంలో అనూష, సిరి, అండర్–17లో వంశిక, రమేషమ్మ, చేతన, అండర్– 19లో శృతి, మేనక ఎంపికయ్యారు. యోగా పోటీల్లో అనూష రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆమె తెలిపారు.

పీపీ హరినాథరెడ్డికి అభినందన



హరినాథరెడ్డిని అభినందిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: నేరం రుజువైతే కఠిన శిక్షలు పడతాయని ఇటీవల అనంతపురం జిల్లా కోర్టు వెలువరించిన సంచలన తీర్పులే నిదర్శనమని ఎస్పీ పి.జగదీష్ అన్నారు. ఇటీవల రెండు కేసుల్లో ముద్దాయిలకు యావజ్జీవ కఠిన కారాగార శిక్షలు విధిస్తూ తీర్పులు వచ్చిన నేపథ్యంలో ఈ కేసుల్లో బాధితుల తరపున వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరినాథరెడ్డిని ఎస్పీ మంగళవారం ఘనంగా సత్కరించారు. జిల్లా నేర సమీక్ష సమావేశంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐల సమక్షంలో అభినందనలు తెలియచేస్తూ, ప్రశంసా పత్రాన్ని అందజేశారు.